క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల దాతృత్వం



ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు

నల్లమాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు దాతృత్వం చాటారు. ఇటీవల పాఠశాల ఆవరణలో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థిని భారతి తన కుటుంబ ఆర్థిక పరిస్థితి, తన కుమారుడు అభిలాష్‌ను బీటెక్ చదివించేందుకు తాను పడుతున్న కష్టాలను వివరించారు. స్పందించిన తోటి విద్యార్థి మూడే రవినాయక్ రూ. 20 వేలు, తక్కిన విద్యార్థులు చందాలు వేసుకొని మొత్తం రూ.47 వేలు భారతికి గురువారం అందజేశారు. హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు లక్ష్మన్న, పూర్వపు విద్యార్థులు మూడే రవినాయక్, చిల్లగోర్ల రమేష్, మనోహర్, రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



పూజలందుకున్న కాశీవిశ్వేశ్వరుడు

చెన్నేకొత్తపల్లి: మాసశివరాత్రిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని కాశీ విశ్వేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి నెల అమావాస్యకు ముందు రోజు వచ్చే దినాన్ని మాస శివరాత్రిగా పిలుస్తారు. దేవాలయంలోని స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాలు, చెరుకురసంతో అభిషేకాలు చేపట్టినట్లు ఆలయ పూజారి వినోద్ భరద్వాజ్ తెలిపారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకుని ఫల, పుష్పాలను సమర్పించారు.

రత్నాకర్‌ను కలిసిన బీసీ ఐక్యవేదిక నాయకులు



రత్నాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

పుట్టపర్తి రూరల్: రాయలసీయ బీసీ ఐక్యవేదిక సభ్యులు అధక్షుడు కొట్టాల శ్రీరాములు ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే రత్నాకర్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. బీసీ హక్కుల సాధనకు సాయం అందించాలని కోరారు. ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన బీసీ ప్రజాప్రతినిధులను సన్మానిస్తామన్నారు. నాయకులు సామకోటి ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, జ్యోతిప్రసాద్, కొండమరాజు, తిరుపతేంద్ర, శివప్ప, ఉమాపతియాదవ్, రమణనాయుడు పాల్గొన్నారు.

షిర్డీసాయి బాబాకు ప్రత్యేక పూజలు



బత్తలపల్లిలో విశేష పూజలందుకుంటున్న షిర్డీసాయి బాబా మూలవిరాట్

బత్తలపల్లి: మండలంలోని షిర్డీసాయిబాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన సంగమేశ్వర క్షేత్రంలో, బత్తలపల్లిలో, రామాపురంలోని షిర్డీసాయి బాబా ఆలయాల్లో బాబాకు అభిషేకాలు, అర్చనలు, భజనలు నిర్వహించారు. సాయి అఖండనామాన్ని జపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేసినట్లు అర్చకులు తెలిపారు.

రోగులకు పాలు, బ్రెడ్ పంపిణీ



పాలు, బ్రెడ్ అందిస్తున్న సేవాదళ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం శ్రీసత్యసాయి భజన మండలి సభ్యులు రోగులు, వారి సహాయకులకు పాలు, బ్రెడ్, బిస్కెట్లు పంపిణీ చేశారు. సేవాదళ్ సభ్యులు సాంబశివుడు, ఆచారి, నాగిరెడ్డి, జనార్దన్, అశోక్, కాకుమాని విద్యాసాగర్ రోగులకు అల్పాహారం అందించారు.

‘అల్లూరి’ పోరాటాలు యువతకు స్ఫూర్తిదాయకం



బత్తలపల్లి ఎమ్మార్సీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ధర్మవరం: అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారులు, పాఠకులు

ధర్మవరం/ధర్మవరం అర్బన్/బత్తలపల్లి/పుట్టపర్తి: తెల్లదొరలనుంచి భారతమాతకు విముక్తి కల్పించేందుకు సాయుధ పోరాట మార్గం ఎంచుకొని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఢీకొన్న మహోజ్వల శక్తి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు ప్రజలు ఘన నివాళులర్పించారు. ఆయన జయంతిని గురువారం ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని వక్తలు సూచించారు. ధర్మవరంలోని గ్రంథాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం అల్లూరి సీతారామరాజు చేసిన ప్రాణత్యాగాన్ని వివరించారు. ధర్మవరం పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. విద్యార్థులు అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్‌నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు. బత్తపల్లి ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు బిల్లే గోపాల్ పాల్గొన్నారు. బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మక్బుల్ హుస్సేన్, తెలుగు అధ్యాపకులు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘నీట్’ అక్రమాలపై పెల్లుబుకిన నిరసన



కదిరిలో డిగ్రీ కళాశాల వద్ద బంద్ నిర్వహిస్తున్న విద్యార్థిసంఘాల నాయకులు



ధర్మవరంలో కళాజ్యోతి సర్కిల్‌లో ధర్నా చేస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు



పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

- విద్యా సంస్థల బంద్ విజయవంతం

కదిరి అర్బన్: వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్, నెట్ పరీక్షల పేపర్ల లీకేజీని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌లో భాగంగా గురువారం జిల్లాలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది.కదిరిలో పలు విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకుగాను 720 మార్కులు రావడం, అందులోనూ ఆరుగురు విద్యార్థులు హర్యాణాలోని ఒకే సెంటర్‌కు చెందిన వారు కావడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. నీట్ పరీక్షపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దక్షిణాది రాష్టాల ముఖ్యమంత్రులు కూడా నీట్ పరీక్షను రద్దు చేయలని చెప్తున్నా కేంద్రం పట్టించుకోవకపోవడం అన్యాయమన్నారు. అనంతరం పట్టణంలోని విద్యాసంస్థలను బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జాన్, ఏఐఎస్ఎ జిల్లా అధ్యక్షుడు నరసింహా, ఎన్ఎస్‌యూఐ ఉపేంద్ర,గణేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో గురువారం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా చేశారు. పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పోతలయ్య, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నిరంజన్‌యాదవ్, ఎన్ఎస్‌యూవై గణేష్, ఏపీఎస్ఎఫ్ శివ మాట్లాడుతూ నీట్ పరీక్షల అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి విద్యా వ్యవస్థ నాశనమవుతోందన్నారు. జాతీయ విద్యా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షలను రాష్ట్రాలకు అప్పచెప్పాలని, నీట్‌పై సమగ్ర విచారణ జరిపించి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నందకిషోర్, నంద, సుకృత్, ఆదర్శ్, అస్లాం, బన్నీ, కార్తీక్, విజయ్ పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నంలో సీపీఐ, సీఐటీయూ నాయకులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం విద్యా సంస్థల బంద్‌ను పాటించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి ర్యాలీలు నిర్వహించారు, నాయకులు మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయ స్థాయి పరీక్షల నిర్వహించడంలో విఫలమైందన్నారు. నీట్ అక్రమాలు, యూజీసీ పరీక్ష రద్దు వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. నీట్‌స్కామ్ దోషులకు శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం నాయకులు హర్షవర్ధన్, అరుణ్‌రెడ్డి, పవన్ విద్యార్థులు పాల్గొన్నారు.

వరి సాగులో సస్య రక్షణపై అవగాహన



వరినారును పరిశీలిస్తున్న ఏఓ,రైతులు

పుట్టపర్తి: రబీలో వరి సాగులో సస్య రక్షణ, కలుపు నివారణపై బుక్కపట్నం ఏఓ సతీష్ రైతులకు అవగాహన కల్పించారు. గురువారం ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటించి వరి నారును పరిశీలించారు. సస్య రక్షణ, కలుపు మొక్కల ఏరివేత, ఎరువుల వినియోగంపై రైతులకు సూచనలు, సలహాలందించారు. వరినారు నాటేందుకు 40 రోజులు ముందుగానే జీలుగ సాగు చేయాలన్నారు. వరి నాటే ముందు బాగా కలియదున్ని వరి నాట్లు నాటాలని సూచించారు.

వ్యవసాయ బోర్ల కేబుల్ చోరీ

మడకశిరరూరల్: అయ్యవారిపల్లికి చెందిన రైతు నరసింహమూర్తి వ్యవసాయ బోరుకు అమర్చిన కేబుల్‌ను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకెళ్లారు. రూ.10 వేల విలువైన కేబుల్‌ను ఎత్తుకెళ్లారని బాధితుడు రైతు నరసింహమూర్తి గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా సింగేపల్లి గ్రామానికి చెందిన రైతు నరసింహారెడ్డి వ్యవసాయ బోరు కేబుల్‌ను దొంగలు చోరీ చేశారు.

రాహుల్‌గాంధీ హిందువులకు క్షమాపణ చెప్పాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మవరం అర్బన్: పార్లమెంట్ సమావేశాలలో హిందువులను కించపరిచేలా విపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలోని బీజేపీ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ హిందువుల పట్ల కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందన్నారు. బాధ్యతగా ఉండాల్సిన ప్రతిపక్ష నేత బాధ్యతారహితంగా మాట్లాడటం సరికాదన్నారు. రాహుల్‌గాంధీ వెంటనే హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు జింకా చంద్రశేఖర్, సాకే ఓబిలేసు, అసెంబ్లీ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, చేనేత సెల్ రాష్ట్ర నాయకులు గుండా పుల్లయ్య, శంకర్ చంద్రశేఖర్, గిర్రాజు రవి, పుట్లూరు నరసింహులు, కార్తీక్, భక్తవత్సలం, రామశేఖర్, మల్లికార్జున, మంజునాథ్, నాగభూషణం, కృష్ణప్రసాద్, ప్రదీప్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు ఘన సన్మానం



సన్మాన గ్రహీతలతో సిద్ధరాంపురం పాఠశాల పూర్వ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం సిద్దరాంపురం ఉన్నత పాఠశాలలో చదివి వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసినవారిని 1976–79 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈఈ కృష్ణమూర్తి, రైల్వే అధికారి మదన్‌మోహన్‌రెడ్డి, స్కూల్ అసిస్టెంట్లు చెన్నకృష్ణారెడ్డి, హనుమంతరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జి.కృష్ణారెడ్డి, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి లక్ష్మీనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ పుల్లప్పలను పూలమాలతో ఘనంగా సత్కరించారు. సమాజానికి వారు అందించిన సేవలను పూర్వ విద్యార్థి, అనంతపురం రాఘవేంద్ర ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్, గూనిపల్లికి చెందిన రవీందర్‌రెడ్డి కొనియాడారు. కాగా పూర్వ విద్యార్థులు, సత్యసాయి భక్తులు పాఠశాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని వక్తలు కొనియాడారు. రూ.20 లక్షలతో పాఠశాలలో సదుపాయాలు కల్పించారన్నారు. పాఠశాల అభివృద్ధిలో సత్యసాయి భక్తులను భాగస్వాములను చేయటంలో చెన్నకృష్ణారెడ్డి కృషి చేశారన్నారు. సమ్మేళనంలో రూ.1,45,000 విరాళంగా ఇచ్చారని హెచ్ఎం తెలిపారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒక్కచోట కలిసిన పూర్వ విద్యార్థులు పరస్పరం ఆలింగనం చేసుకొని యోగక్షేమాలు తెలుసుకొని ఆనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకొని సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థులు లక్ష్మీనారాయణ, శంకర్‌నారాయణ, ప్రతాప్‌రెడ్డి,అమీర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేద్దాం



కేజీబీవీ పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సన్నీవంశీకృష్ణ

ఎన్పీకుంట: గ్రామాల్లో జరుగుతున్న బాల్యవివాహాలను అరికట్టడంలో వీఆర్‌ఓలు విఫలమవుతున్నారని, ఇప్పటికైనా మేల్కొని బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించాలని ఆర్డీఓ సన్నీవంశీకృష్ణ ఆదేశించారు. మండల కేంద్రంలోని పలు కార్యాలయాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరులో జాప్యం వహించరాదని ఆదేశించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. నాడు–నేడు పనులకు సంబంధించిన రికార్డులు చూపించక పోవడంతో సిబ్బందిపై అగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై విద్యార్థినులతో ఆరా తీశారు. సిబ్బంది సఖ్యతతో ఉండి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయినులను సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఓపీ వివరాలను వైద్యాధికారి డాక్టర్ అనంద్‌వర్ధన్‌ను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంఈఓ గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం



వృద్ధుడికి బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది



చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ప్రజలు డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. గురువారం ప్యాదిండి గ్రామ సచివాలయం పరిధిలోని గొల్లవాండ్లపల్లిలో వైద్య సిబ్బంది పర్యటించారు. వృద్ధులకు బీసీజీ టీకాలు వేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ డయేరియాపై అవగాహన కల్పించారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు డయేరియాను ఆపండి అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో వ్యాధి ప్రబలకుండా 0 నుంచి 5 ఏళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలను గుర్తించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పిల్లలకు ఓఆర్ఎస్ కలిపిన నీటిని తప్పక తాగించాలని తల్లిదండ్రులకు సూచించారు. అతిసారం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అతిసారం లక్షణాలు ఉంటే వెంటనే సమాచారం అందించాలన్నారు. భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సలహాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ విష్ణువర్ధన్, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, ఏఎన్ఎం మాధవి, ఆశావర్కర్లు మంజుల, లింగమ్మ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నేలకోటమ్మ శత జయంతి ఉత్సవాలు



అమ్మవారి మూల విరాట్

ముదిగుబ్బ: మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో కొలువైన నేలకోటమ్మ శత జయంతి ఉత్సవాలను ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 6న గోపూజ, గంగపూజ, గణపతి పూజ, 7న వేద పారాయణం, కలశ పూజ, హోమాలు, 8న కలశపూజ, చండీ హోమం, పూర్ణాహుతి, ఉద్వాసన కార్యక్రమాలను నిర్వహిస్తారు. 9న అమ్మవారికి బోనాలను సమర్పిస్తారని తెలిపారు.

అమ్మవారి మహత్యం

మొదట ఈ గ్రామాన్ని మొలతాడుగా పిలిచే వారు. కాలక్రమేణా మొరతాడుగా మారి ప్రస్తుతం మర్తాడుగా పిలుస్తున్నారు. 1920లో కలరా వ్యాప్తి చెందింది. ఆ రోజుల్లో దామానుపల్లి, మర్తాడు గ్రామాల్లో చాలా మంది చనిపోయారు. పాపిరెడ్డి అనే గ్రామ పెద్ద 1924లో గ్రామ దేవతను ప్రతిష్టించి గుడి నిర్మాణం చేసి పూజలను ప్రారంభించగా మొదటి పూజారి నారాయణమ్మకు అమ్మవారు కనిపించేవారని, రాత్రి పూట గ్రామాలలో అమ్మవారు తిరిగేవారని, అప్పటి నుంచి కలరా వ్యాధి తొలగిపోయిందని గ్రామస్తుల నమ్మకం.

పూజలు చేసేది వీరే

అమ్మవారికి కాకి నారాయణమ్మ, కాకి పుల్లన్న, కాకి శ్రీనివాసులు వంశస్తులు పూజారులుగా వ్యవహరిస్తున్నారు. హరిజనులు మొదటి పూజ నిర్వహిస్తారు. అమ్మవారికి పాదరక్షలు సమర్పిస్తారు.

సంగీత మహోత్సవాన్ని జయప్రదం చేయండి



పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం: సద్గురు యోగి నారాయణ కైవారం తాతయ్య మఠంలో ఈనెల 19 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న గురుపూజ, సంగీత మహోత్సవాన్ని జయప్రదం చేయాలని యోగి నారాయణ సేవా సమితి సభ్యులు కోరారు. గురువారం స్థానిక కేవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా హిందూపురం సేవా సమితి అధ్యక్షుడు రవిశంకర్ మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా 8 నుంచి నుంచి పదిరోజులపాటు ప్రతి గ్రామంలో యోగి నారాయణ తాతయ్య గారి గురుపూజ, భక్తి సంగీత మహోత్సవ పోస్టర్లు, కరపత్రాలను పంపిణీ చేస్తామన్నారు. గురుపూజ సంగీత మహోత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి సభ్యులు,భక్తులు రాజ్యలక్ష్మి మోహన్, పార్థసారథి, ఆకుల ఉమేష్, రామంజి, నవీన్ కుమార్, శేషాద్రి గౌడ్, అరుణ్ కుమార్, చంద్రశేఖర్, ఇక్బాల్, మంజు, నాగరాజు, వెంకటేష్, హనుమంతప్ప, జగదీష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో క్షయకు చెక్



నార్శింపల్లిలో బీసీజీ టీకా వేయించుకున్న వృద్ధులతో మాట్లాడుతున్న వైద్యులు

తాడిమర్రి: బీసీజీ టీకాతో క్షయను పూర్తిగా నిర్మూలించవచ్చని వైద్యాధికారులు హరిత, గోవర్ధన్ నాయుడు పేర్కొన్నారు. నార్శింపల్లి, మద్దులచెర్వు గ్రామాల్లో జరుగుతున్న బీసీజీ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం వారు పర్యవేక్షించారు. క్షయ బాధితులు, వారి కుటుంబ సభ్యులు, బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారు, వృద్ధులు బీసీజీ టీకా వేయించు కోవాలన్నారు. ఇదివరకే ఉన్న క్షయ పూర్తిగా నయం కావడంతోపాటు కొత్తగా ఎవ్వరికీ సోకదన్నారు. టీకాతో ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని తెలిపారు. అనంతరం మూడు వారాల క్రితం టీకా వేయించుకున్న వృద్ధుల ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ హేమలత, ఏఎన్ఎంలు కోమలి, కృష్ణమ్మ, రత్నమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన పెంచుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జ్యోత్స్న

పుట్టపర్తి అర్బన్: ఫ్లోరోసిస్, అతిసారం నియంత్రణ, సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని పుట్టపర్తి ఆరోగ్య కేంద్రం డాక్టర్ జ్యోత్స్న పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం నిడిమామిడి గ్రామంలో గురువారం జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యురాలు మాట్లాడుతూ నీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉంటే ఈ వ్యాధి వస్తుందన్నారు. ఫ్లోరోసిస్‌తో పళ్లు, ఎముకలు పెలుసుగా మారుతాయన్నారు. వివిధ రకాల ఫ్లోరోసిస్ సంబంధ కేసులు వస్తున్నాయని, రక్త, మూత్ర పరీక్షల ద్వారా నిర్ధారించి సహాయక చర్యలు చేపడతామన్నారు. అనంతరం అతిసారం లక్షణాలు, చికిత్స, ఓఆర్ఎస్, జింక్ మాత్రలు, డాల్ట్ బీసీజీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై వివరించారు. సీహెచ్ఓ నగేష్, సూపర్ వైజర్ చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీ సుస్మిత పాల్గొన్నారు.

7, 14 తేదీల్లో కంటి వైద్య శిబిరాలు



కరపత్రాలు విడుదల చేస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 7న కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం తెలిపారు. ఈమేరకు గురువారం కరపత్రాలు విడుదల చేశారు. కంటిచూపు తగ్గినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యక్షుడు సుకుమార్, కోశాధికారి బండి నాగేంద్ర, క్యాంపు చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, సభ్యులు చాంద్ బాషా, రమేష్‌బాబు, బండ్లపల్లి రంగనాథ్, వైకే శ్రీనివాసులు, బాలం ఆదిశేషు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 14న ఉచిత కంటి శిబిరం నిర్వహించనున్నామని రోటరీక్లబ్ అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్‌గుప్త తెలిపారు.

మరమ్మతులు చేపట్టాలి

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధి వెలుపల ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని జనసేన నాయకులు కోరారు. గురువారం వారు రోడ్డును పరిశీలించారు. సత్యసాయి భక్తులు, వీఐపీలు పుట్టపర్తి పట్టణం, ప్రశాంతి నియలయంలోకి వెళ్లేందుకు గతంలో పెట్రోల్ బంక్ నుంచి కమ్మవారిపల్లి చింతతోపులు, వెస్ట్ గేట్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు వేశారన్నారు. ఆ రోడ్డుకు మరమ్మతులు చేయాలన్నారు. శ్రీనివాసులు, మారుతి, రమేష్‌బాబు, కూర్మనాయకుల గణేష్ పాల్గొన్నారు.

10న మండల సమావేశం

తలుపుల: ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 10వతేదీ ఉదయం 11 గంటలకు మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ తెలిపారు. మండల అధికారులు పాల్గొని తమ శాఖలపై సభ్యులకు సమాచారం అందించాలని కోరారు.